క్లుప్తంగా

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె గ్రామంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమ, సింధూర అర్చనలు, ఆకుపూజలు చేపట్టారు. అనంతరం అర్చకుడు లక్ష్మణస్వామి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ఉయ్యాలవాడ: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు మంగళవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సొంత మండలం కాకుండా ఇతర మండలాల్లో నియమించాలన్న బదిలీల ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయాల సంఘం మండల శాఖ అధ్యక్షుడు, డిజిటల్ అసిస్టెంటు మౌలాలి మాట్లాడుతూ జీఓ నెం 5ను రద్దు చేసి గ్రామస్థాయి ఉద్యోగులను సొంత మండలాల్లోనే బదిలీ చేపట్టాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబుకు అందజేశారు.

సామాజిక సేవాభావం అవసరం



మాట్లాడుతున్న ధర్మవీర్ పాల్

నంద్యాల(న్యూటౌన్): దైవ సేవకులు సామాజిక సేవాభావం కలిగి ఉండాలని ఆసియా దేశాల కడవరి వర్షపు సంఘాల ప్రతినిధి, మండెపేట దైవ జనులు బ్రదర్ ధర్మవీర్‌పాల్, స్వర్ణ ధర్మవీర్‌పాల్, బందెల రాజు అన్నారు. దేశ క్షేమాన్ని కాంక్షిస్తూ మంగళవారం నంద్యాల పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో ఏసుకృప మినిస్ట్రీస్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లాలోని క్రైస్తవ దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో అందరికీ ఆరోగ్యం అన్నదే లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏసుకృప మినిస్ట్రీస్ అధినేత అందనం ఏసన్న, బ్రదర్ బెన్‌హిన్, డాక్టర్ పబ్బతి విజయమోహన్, డాక్టర్ మనోహర్, రూపాస్, పాస్టర్ మనోహర్, పాస్టర్ కొప్పెర సునీల్, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీహెచ్‌ఈఓలు బాధ్యతల స్వీకరణ



డీఎంహెచ్ఓను కలిసి ఎంపీహెచ్‌ఈఓలు

గోస్పాడు: కొత్తగా బదిలీపై వచ్చిన ఎంపీహెచ్ ఈఓలు బాధ్యతలు చేపట్టారు. జిల్లా వైద్యాధికారి వెంకటరమణను కలిసి మంగళవారం రిపోర్ట్ చేశారు. బదిలీపై వచ్చిన వారిలో నరసప్ప(డీఎంహెచ్ఓ ఆఫీసు, నంద్యాల), వెంకటరమణ (నారాయణాపురం), రవీంద్ర(రుద్రవరం), రాఘవేంద్ర (ఎర్రమటం), అబ్దుల్‌రహిమాన్(పలుకూరు), ఓబులేసు(టంగుటూరు), వేణుగోపాల్‌రెడ్డి(చిన్నమల్కాపురం) ఉన్నారు. వీరికి డీఎంఅండ్‌హెచ్ఓ మూమెంట్ ఆర్డర్స్ అందజేశారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం కాళికాంబాదేవికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. అనంతరం మహామంగళహారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దారులు ఛిద్రం..
ప్రయాణం నరకం

- పట్టనట్లు వ్యవహరిస్తున్న కూటమి సర్కారు
- గుంతలు,ముళ్ల కంపలతో మూసుకుపోయిన పల్లె రోడ్లు
- వర్షం కురిస్తే నిలిచిపోతున్న రాక పోకలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

పల్లెలు పట్టణాలకు పట్టుకొమ్మలు అంటారు.అలాంటి పల్లెలను కూటమి సర్కారు విస్మరిస్తోంది. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే రహదారులను అభివృద్ధి చేస్తామని, దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేస్తామని గొప్పలు చెప్పిన ఈ ప్రభుత్వం ఏడాది గడిచినా ఆచరణలో పెట్టలేదు. దీంతో ప్రధాన రోడ్లతో పాటు పల్లెలకు అనుసంధానంగా ఉన్న పంచాయతీ రాజ్ రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా గుంతలు, ముళ్లకంపలతో దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఈ మట్టి రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పుడు వానాకాలం ప్రారంభం కావడంతో ఆ రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

రుద్రవరం: రుద్రవరం మండలంలో 21 గ్రామ పంచాయతీలు, 22 మజరా గ్రామాలు ఉన్నాయి. వాటిల్లో పలు గ్రామాల అనుసంధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దారులన్నీ గుంతలమయం అయ్యాయి. ఇరువైపుల ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి మూసుకు పోయాయి. వర్షం కురిసినప్పుడు గుంతల నిండా నీరు నిలుస్తోంది. ఆ నీటిలో గుంత లోతు ఎంత ఉందో తెలియక వాహనాలు వెళ్త ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఇరువైపుల మూసుకుపోయిన కంప గుచ్చుకుంటుండటంతో రక్తగాయాలు అవుతున్నాయి.ఇంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం వాటి మరమ్మతులపై దృష్టి సారించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.



శ్రీరంగాపురం-పెద్ద కంబలూరు దారి ఇలా..

➡మండల పరిధిలోని అప్పనపల్లె చిన్నకంబలూరు పంచాయతీకి మజరా గ్రామం. ఈ గ్రామ ప్రజలు ఏ చిన్న సమస్య అయిన చిన్నకంబలూరు గ్రామ సచివాలయానికి వెళ్లాల్సి ఉంది. అలాగే ఎన్నికలు వస్తే అక్కడికే వెళ్లి ఓటు వేయాలి. రేషన్ కావాలన్నా అక్కడికే వెళ్లాలి. ఇలా ప్రతి పనికి చిన్నకంబ లూరుకు వెళ్లాలి. అయితే అప్పనపల్లె నుంచి చిన్నకంబలూరు వెళ్లాలంటే ఆ రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు నరకానికి నకలుగా మారింది. దారంతా గుంతలు, ముళ్ల కంపతో నిండిపోవడంతో ప్రయాణం ప్రమాదకరమైంది.

➡శ్రీరంగాపురం నుంచి డి. కొట్టాల మీదుగా పెద్ద కంబలూరు వరకు ఉన్న మూడు గ్రామాల అనుసంధాన రహదారి పరిస్థితి కూడా అంతే. మట్టి రోడ్డు కావడంతో వాహనాల రాక పోకలకు చాలా ఇబ్బందిగా మారింది. ఒక్క సారి వాన కురిస్తే వంద రోజులు దారంతా బురదే. శ్రీరంగాపురం,డి.కొట్టాల వారు మండల కేంద్రమైన రుద్రవరానికి చేరుకునేందుకు పెద్దకంబలూరు మీదుగా కేవలం 10 కి.మీ లోపే ఉంటుంది. అటు వైపు రావడానికి వీ లు కాక పోవడంతో ఎల్లావత్తుల,చిన్నకంబలూరు మీదుగా అదనంగా 8 కి.మీ తిరిగి రావాల్సి వస్తోంది.



బురద మయంగా అప్పనపల్లె-చిన్నకంబలూరు దారి

➡బి.నాగిరెడ్డిపల్లె నుంచి పేరూరు మధ్య ఉన్న అనుసంధాన రహదారిపై గతంలో మెటల్ రోడ్డు వేశారు. అయితే, ఎప్పుడో వేసిన మెటల్ రోడ్డు కావడంతో భారీ వర్షాలకు, వాహనాల రాక పోకలకు కంకర అంత కొట్టుకు పోయి మట్టి రోడ్డు మిగిలింది. ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయంగా మారింది. వర్షాకాలంలో వాటిలో నీరు నిలిచిపోతుండటంతో వాహన దారులు గుంత లోతు ను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.

➡తిప్పారెడ్డిపల్లె నుంచి నక్కలదిన్నె వరకు ఉన్న అను సంధాన రహదారి మరి దారుణంగా ఉంది. ఈ దారికి ఇరువైపులా ఉన్న పొలాల యజమానులు ఆక్రమించుకోవడంతో కుచించుకుపోయింది. కొన్ని చోట్ల పొలాల్లో వెళ్లాల్సి వస్తోంది.

➡హరినగరం మజరా తండా వరకు ఉన్న దారి మట్టి రోడ్డే అయినప్పటికి మోకాళ్లలోతు గుంతలు ఉన్నాయి. అలాగే ఇరువైపులా ముళ్ల కంప పెరిగి ఇబ్బందికరంగా మారింది. ఈ దారులను బాగు చేయాల్సిన పాలకులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పల్లె పండగా పేరుతో కొన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్డు వేసి చేతులు దులుపు కుంటున్నారు.



బి.నాగిరెడ్డిపల్లె-పేరూరు దారిపై నిలిచిన వర్షపు నీరు

వ్యవసాయ పనులు చేసుకోలేకున్నాం



అనుసంధాన రహదారులు సరిగా లేక పోవడంతో వాహనాలపై రాక పోకల మాట అటుంచితే అటువైపు ఉన్న పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నాం. పొలాలకు రసాయన ఎరువులు తీపుకెళ్లాలన్నా, పంట దిగుబడులు ఇళ్లకు చేర్చుకోవాలన్నా చాలా ఇబ్బందిగా ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా ఈ రోడ్లపై దృష్టి సారించక పోవడం బాధాకరం.

–రమణ, శ్రీరంగాపురం

రోడ్డు కష్టాలు తీరేదెన్నడో



పేరూరు నుంచి బి.నాగిరెడ్డిపల్లె వరకు ఉన్న అను సంధాన రహదారి దారుణంగా ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ దారిలో రాక పోకలు సాగించలేక బి.నాగిరెడ్డిపల్లె వైపు రావడం మానేశాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేరూరు నుంచి శిరివెళ్ల వరకు కోట్లాది రూపాయలతో వేసిన రోడ్డు, నిర్మించిన వంతెన మీదుగా రాక పోకలు సాగిస్తున్నాం. మరి అత్యవసరమైతే ఎర్రగుడిదిన్నె మీదుగా రాక పోకలు సాగిస్తున్నాం. – వెంకటేష్, పేరూరు

ట్రిపుల్‌ఐటీకి ఎంపిక

దొర్నిపాడు:మండలంకేంద్రం దొర్నిపాడుకు చెందిన సాయిధనుష్ ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యాడు. స్థానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో 572 మార్కులు సాధించాడు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నలుగురు విద్యార్థుల ఎంపిక

శిరివెళ్ల: ట్రిబుల్ ఐటీకి తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇష్రత్‌బేగం మంగళవారం తెలిపారు. గుమ్మ కావ్య నూజివీడు, హర్షవర్ధన్ రెడ్డి, తేజ్‌నాథ్‌కు ఆర్కేవ్యాలీ, సిరి చందనకు ఒంగోల్ ట్రిబుల్‌ఐటీలో సీటు వచ్చిందన్నారు. వీరు పది పరీక్షల్లో 550 పైగా మార్కులు సాధించి సీట్లకు ఎంపికయ్యారన్నారు.

శక్తి యాప్ రక్షణ కవచం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థినులు, మహిళలకు శక్తియాప్ రక్షణ కవచంలాంటిదని సీఐ జయరాం అన్నారు. పట్టణంలోని రావూస్, నారాయణ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులకు పోక్సో చట్టాలు, వన్‌స్టాప్ సెంటర్, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మద్దయ్య, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ

ఉచిత స్పర్శదర్శన క్యూలైన్ల పరిశీలన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థాన ఉచిత క్యూలైన్లను కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుత ఉచిత దర్శనం క్యూలైన్ ద్వారానే స్పర్శదర్శనం భక్తులను కూడా అనుమతించాలన్నారు. ఉచిత స్పర్శదర్శనం భక్తులు వేచివుండేందుకు ప్రత్యేకంగా హోల్డింగ్ ఏరియా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీబాల కృష్ణను ఆదేశించారు. టోకెన్లను అందజేసేందుకు రెండు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఐటీ విభాగాన్ని ఆదేశించారు. టోకెన్లలో భక్తుడి పేరు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లను నమోదు చేయాలన్నారు. ఉచిత స్పర్శదర్శనం వేళల గురించి భక్తులకు స్పష్టంగా తెలిసే విధంగా మైకు ద్వారా తెలియజేస్తుండాలని సూచించారు. సహాయ కార్యనిర్వహణాధికారులు ఎం.హరిదాసు, మల్లికార్జునరెడ్డి, స్వాములు ఉన్నారు.



క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈఓ శ్రీనివాసరావు

అన్నప్రసాదంలో నాణ్యత తప్పనిసరి

అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అన్నప్రసాదాలకు వినియోగిస్తున్న కూరగాయలు, స్టోరులోని సరుకుల నాణ్యతను పరిశీలించారు. ప్రతి రోజు తాజా కూరగాయాలను మాత్రమే వాడాలన్నారు. సిబ్బంది భక్తులతో మర్యాదగా మెలగాలని సూచించారు.

శాంతియుత ఉద్యమాలను కొనసాగిస్తాం

- సేవ్ వక్ఫ్ సేవ్ కాన్‌స్టిట్యూషన్ జేఏసీ



పోస్టర్లు విడుదల చేస్తున్న జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): వక్ఫ్ సవరణ చట్టం వెనక్కు తీసుకునే వరకు శాంతియుతంగా ఉద్యమాలను చేస్తూనే ఉంటామని సేవ్ వక్ఫ్ సేవ్ కాన్‌స్టిట్యూషన్ జేఏసీ నేతలు ప్రకటించారు. మంగళవారం ఉదయం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో ఈ నెల 30న నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ సయ్యద్ జాకీర్ అహ్మద్ రషాదీ, కో కన్వీనర్ ఎంఏ హమీద్, నాయకులు షరీఫ్, షౌకత్‌అలీ, సాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింలపై తమకున్న వివక్షతో శతాబ్దాల నాటి వక్ఫ్ చట్టాన్ని సమూలంగా మార్చి ఉమీద్‌గా నామకరణం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛంద సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ఆధ్వర్యంలో గత ఏడాది నుంచి అనేక నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వంలో ఎలాంటి స్పందన కనిపించడం లేదన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామన్నారు. కేంద్రం వైఖరికి నిరసనగా ఈ నెల 30న సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వ్యక్తి మృతి

రాజుపాళెం: మండలంలోని గాదెగూడూరులో ప్రమాదవశాత్తూ విద్యుత్ లైన్ తీగలు తగిలి ముల్లా ఖాజా (45) అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. మండలకేంద్రం చాగలమర్రికి చెందిన ముల్లా ఖాజా రాజుపాళెం మండలంలోని గాదెగూడూరులో ఓ ఇంటి నిర్మాణ పనికి వచ్చాడు. గోడకు సిమెంట్ ప్లాస్టింగ్ వేసే క్రమంలో విద్యుత్ లైన్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన ముల్లా ఖాజా

రేపు రాతిదూలం పోటీలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవర 16 రోజుల పండగా సందర్భంగా గురువారం న్యూ క్యాటగిరి విభాగం రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, రైతు సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8332889066, 9441801801 నంబర్లకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

బనగానపల్లె రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి అన్నారు. మంగళవారం మండలంలోని యనకండ్ల గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులకు పోక్సో కేసు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వ్యాట్సాప్ ద్వారా వచ్చే ఏపీకే ఫైల్స్ ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ తదితర వివరాలను ఎవరితో పంచుకోవద్దని తెలిపారు.

ఉమ్మడి సర్వే నంబర్ల సవరణకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యాలవాడ : మండలంలోని రీ సర్వే గ్రామాల్లో ఉమ్మడి సర్వే నంబర్లతో అనుభవంలో ఉన్న రైతులు సవరణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలువురు రైతులకు జాయింట్ ఎల్‌పీఎం పడిందన్నారు. దీంతో ఆన్‌లైన్‌లో భూమి విస్తీర్ణం అధికంగా చూపడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపునకు ఇబ్బందిగా మారిందన్నారు. కావున గ్రామ సచివాలయాల్లో ఈ నెల ఆఖరులోగా రూ. 50 ఫీజు చెల్లించి విస్తీర్ణం తగ్గించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులు ఆయా గ్రామాల వీఆర్‌ఓలకు అందజేయాలని సూచించారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి

నంద్యాల(న్యూటౌన్): గడివేముల మండలంలోని కరిమద్దెల గ్రామంలో ఎంపీపీ స్పెషల్ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డికి కరిమద్దెల గ్రామస్తులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎస్సీ కాలనీలోని ఈ పాఠశాలలో 46 మంది విద్యార్థులు ఉన్నారని, వీరికి విద్యాబోధన చేసేందుకు ఇద్దరు టీచర్లు ఉండగా అందులో ఒకరు బదిలీ అయ్యారన్నారు. ఆ స్థానంలో ఇప్పటి వరకు కొత్తగా ఎవరినీ నియమించలేదన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి తమ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కరిమద్దెల గ్రామ వాసులు నాగరాజు, మధు, నాగకృష్ణ, రమేష్, చిన్నస్వామి, వెంకటకృష్ణ ఉన్నారు.

నేడు పాస్టర్ల సదస్సు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో జిల్లా పాస్టర్ల(దైవసేవకుల) సదస్సు నిర్వహిస్తున్నట్లు కల్వరి కరుణ ప్రార్థనా మందిరం నిర్వాహకులు కడియం అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని దైవ సేవకులను చైతన్య పరిచి సమాజంలో విధి విధానాలు నేర్పించేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని దైవసేవకులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా వినుకొండకు చెందిన పాస్టర్ జాన్ పీటర్, నంద్యాలకు చెందిన సుజన పరిచర్య నిర్వాహకులు డాక్టర్ లింగం మనిరాజ్ భాస్కర్(బిషప్) పాల్గొని దైవసందేశం అందిస్తారని తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



సుబ్బరాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి



సుజాత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శిల్పారవి

నంద్యాల: నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్ డెడ్ అయిన సచివాలయ సెక్రటరీ సుజాత కుటుంబ సభ్యులను, అలాగే ఇటీవల మృతి చెందిన పట్టణంలోని 21వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బరాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్‌కు గురైన సచివాలయ సెక్రటరీ సుజాత తన అవయవాలను దానం చేసి జీవం పోసిందన్నారు. వైఎస్సార్‌సీపీలో పని చేసిన సుబ్బరాయుడు మృతి చెందడం పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటు అన్నారు. శిల్పారవి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, జనార్దన్‌రెడ్డి, వేణు, సుబ్బరాయుడు, అనిల్ అమృతరాజ్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర

నంద్యాల(అర్బన్): గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మార్పు ద్వారా విజేతలు–సాధికారతతో స్వపరిపాలన సాధ్యంపై నంద్యాల డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన 65 మంది మహిళా సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుగుణశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచులు తమ విధులు, బాధ్యతలు, నిధులపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. సాధికారతతో స్వపరిపాలన సాధ్యంపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్ఐఆర్‌డీ) సభ్యులు నాగేశ్వరరావు, రీసోర్స్ పర్సన్ దస్తగిరిబాషా, సంజామల డిప్యూటీ ఎంపీడీఓ రాధికారెడ్డి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక డిప్యూటీ ఎంపీడీఓ శివనాగజ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వరస్వామికి నూతన వస్త్ర సమర్పణ, విశేషార్చన, నానబెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

- శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు.

ఇష్టానుసారంగా విద్యుత్ కోతలా?

నందికొట్కూరు: విద్యుత్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా కోతలు విధిస్తున్నారని, అసలు ఎందుకు విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారో చెప్పాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిలదీశారు. మంగళవారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ.ఏ సమయంలో కరెంట్ వస్తుందో .రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. బోర్ల కింద వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిడుతూరు–గార్గేయపురం రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆర్‌అండ్‌బీ ఏఈ మనోధర్‌పై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఏఈ మండలానికి ఎప్పుడు వస్తారో కనీసం తమకు కూడా తెలియడం లేదని మండిపడ్డారు.

పచ్చిరొట్ట ఎరువులతో నేల సారవంతం

నంద్యాల(అర్బన్): పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగ, పిల్లిపెసర, మినుము సాగు చేయడం ద్వారా భూమిలో కర్బన శాతం పెరిగి నేల సారవంతమవుతుందని నంద్యాల ఏఓ ప్రసాదరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లె, బిల్లలాపురం గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. వరి మడుల గట్లపై కంది లేదా కూరగాయల సాగు చేస్తే అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. వరిలో ఎన్‌డీఎల్ఆర్–7, ఆర్ఎన్ఆర్–15048 రకాలు ఖరీఫ్ సాగుకు అనువైనవని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రసాయన మందుల వాడకం తగ్గించాలి

దొర్నిపాడు: పెట్టుబడి ఖర్చు పెరగకుండా ప్రస్తుత ఖరీఫ్ సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. మంగళవారం మండలంలోని చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా కంది విత్తనాల కిట్లు అందజేశారు. అనంతరం పశువైద్యాధికారి చిన్నబాబు మాట్లాడుతూ గొర్రెలకు నీలినాలుక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీ వైస్ ప్రెసిడెంట్ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



డి. వన్నిపెంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం,



కందివిత్తనాలను పంపిణీ చేస్తున్న దొర్నిపాడు ఏఓ

రుద్రవరం: రసాయన ఎరువులు అధికంగా వాడితే పొలాలు చౌడు భూములుగా మారే ప్రమాదముందని వ్యవసాయాధికారిని సుమతి అన్నారు. మండల పరిధిలోని శ్రీరంగాపురం డీ.కొట్టాల గ్రామాల్లో మంగళవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలు వాటి నుంచి మంచి దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గోస్పాడు: సాగు సమయంలో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి సూచించారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం ర్వహించారు. ఆమె మాట్లాడుతూ సాగుకు ముందు రైతులు విత్తనశుద్ధి చేయాలన్నారు.అలాగే భాస్వరం ఎరువులు పైపాటున వేయరాదని సూచించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని దాని వలన ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రామకష్ణ ,అగ్రికల్చర్ అసిస్టెంట్ హరి, రైతులు పాల్గొన్నారు.

చాగలమర్రి: భూమి సారవంతంగా, ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రీయ కర్బనం ఎంతో అవసరమని చాగలమర్రి ఏఓ రంగనేతాజి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని డి.వనిపెంట, గోడిగనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పంట సాగుకు ముందు రైతులు భూసార పరీక్షలు చేసుకొని రిపోర్టు ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు.